www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 26 నవంబర్ 2024
5
అన్నమయ్య



జాతీయ స్థాయి తైక్వాండోకు మానస ఎంపిక

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు విజడమ్ సెంట్రల్ స్కూల్ విద్యార్థిని మానస ఎంపికైనదని కరస్పాండెంట్ డాక్టర్ టి.ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ సాధించి జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైనదని తెలిపారు. మానస సాధించిన విజయాన్ని పాఠశాల ప్రిన్సిపల్ టి.ప్రియాంక, అడ్మిన్ డైరెక్టర్ టి.మదన్మోహన్, అకడమిక్ ఇన్‌ఛార్జ్ పి.ముఖేశ్, ఉపాధ్యాయులు అభినందించారు. మానస భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

స్మార్ట్ మీటర్లు వచ్చేశాయి



- ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలకు బిగింపు
- త్వరలో గృహాలకూ...
- ముందస్తుగా బిల్లు చెల్లించాల్సిందే
- లేదంటే విద్యుత్ కట్
- వద్దే వద్దంటున్న వినియోగదారులు



ప్రజాశక్తి - రాయచోటి

ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా బిగిస్తున్నారు. వీటిని మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, రెండవ దశలో దుకాణాలు, మూడో దశలో పరిశ్రమలు, గృహాలకు, బోర్లకు స్మార్ట్ మెటల్ బిగించడానికి విద్యుత్ అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో మొత్తంగా 1302 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి .ఇప్పటి వరకూ 375 ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. ఆ తరువాత దుకాణాలు, గృహ వినియోగదారులకు అమర్చుతామని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు. గృహ వినియోగదారుల్లో 800 యూనిట్ల పైబడిన వారికి మాత్రమే స్మార్ట్ మీటర్లు తొలుత అమర్చుతారు. ఈ మీటర్లు ఏర్పాటు వల్ల ముందుగా రీఛార్జి చేసుకుంటేనే విద్యుత్తు ఉంటుంది, లేకుంటే విద్యుత్ కట్ చేస్తారు. పేద, మధ్య తరగతి, ధనిక, వ్యాపారస్తులు అనే తేడా లేకుండా అందరిపైనా స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ భారాలు భారం పడే అవకాశం ఉంది. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వాణిజ్య వినియోగదారులు (కమర్షియల్) దాదాపు 52962 లక్ష మంది, గృహ వినియోగదారులు 5,07,988 మంది ఉన్నారు. స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టును అదాని సంస్థకు కేంద్ర ప్రభుత్వం అప్పజెప్పింది. ఒక్కో స్మార్టు మీటరుకు రూ.12 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం.

రీఛార్జి చేసుకుంటేనే.. లేదంటే విద్యుత్ కట్

నిత్యం వాడే సెల్ ఫోన్ మాదిరిగా స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. వెంటనే రీఛార్జ్ చేసుకోకపోయినా, మరచి పోయినా విద్యుత్ దానికదే కట్ అవుతుంది. మళ్లీ తిరిగి రీఛార్జి చేయాలంటే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరని ప్రజలలో వాదనలు వినిపిస్తున్నాయి. దీనివల్ల సాధారణ ప్రజలకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతానికి ఇప్పుడు నెలకు ఒక్కసారి విద్యుత్తు బిల్లులు కడుతున్నారు. స్మార్ట్ మీటర్లు ఇక్కడ వస్తే రీఛార్జి ఎప్పుడు అయిపోతే అప్పుడు వినియోగదారులు కట్టుకోవాల్సిందే.

స్మార్ట్ మీటర్లపై కూటమి ప్రభుత్వం మౌనం

కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉంది. గత వైసిపి స్మార్ట్ మీటర్లను కూటమి వ్యతిరేకించిన విషయం తెలిసిందే. అయితే మొబైల్ మాదిరిగా ముందుగా డబ్బులు కట్టి రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ వినియోగించిన తరువాత ప్రతి నెల 10 నుంచి 15 రోజుల వ్యవధిలో బిల్లు కట్టించుకుంటున్నారు. స్మార్ట్ మీటర్ల వచ్చాక అది కుదరదు. నెలకు ఎంత విద్యుత్ బిల్లు వస్తుందో సగటున అంచనా వేసి ఆ మొత్తాన్ని ముందుగానే చెల్లించి మీటరును రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపైన ప్రభుత్వం ఆలోచించి స్మార్ట్ మీటర్లు బిగించద్దని ప్రజలు, వ్యాపారులు, రైతులు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న స్మార్ట్ మీటర్ల బిగించవద్దు. ఇప్పటికే వ్యవసాయ కూలీలు పెరిగిపోయాయి. వర్షాలు కూడా సక్రమంగా పడకపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. స్మార్ట్ మీటర్ల ఆలోచన విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి.

- కుర్రపోతుల రెడ్డెప్ప, రైతు, మాధవరం, రాయచోటి.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపాలి



రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే ఆపాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారు. ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. నివాస గృహాలను మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించడానికి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 17 వేల కోట్ల రూపాయలు ట్రూ అప్ ఛార్జీల భారం వేస్తున్నారని, మరోవైపు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించటం తగదు. ఈ అంశాలపై ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి స్మార్ట్ మీటర్లు ఆపాలి.

-పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కన్వీనర్, అన్నమయ్య.

అపోహలు వద్దు



జిల్లాలో స్మార్ట్ మీటర్ల పై ఎవరు అపోహ పెట్టుకోవద్దు. అందరూ ఇటువంటి అనుమానం లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించుకోవచ్చు. దీనివల్ల వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించుకున్న అవకాశం కూడా ఉంటుంది. దీనిపై భవిష్యత్తులో రాయితీ కూడా ఇచ్చే అవకాశం ఉండవచ్చు.

- చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ, రాయచోటి.

రూ.29 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు

- రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లాకు ప్రభుత్వం క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు చేశామని మంత్రి పేర్కొన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వైద్యాధికారులతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు చేశామన్నారు. త్వరలో ఈ క్రిటికల్ కేర్ యూనిట్ ను ప్రజలకు అనుకూలమైన ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు.దాదాపు రూ. 29 కోట్లతో మంజూరైన ఈ క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మించడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు, ఇతర అత్యవసర వైద్య చికిత్సల కోసం తక్షణం మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణాపాయం నుండి వారిని కాపాడుతారని చెప్పారు. గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారన్నారు. అన్నమయ్య నూతన జిల్లా ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం నూతనంగా క్రిటికల్ కేర్ యూనిట్‌ను మన జిల్లాకు ఏర్పాటు చేశామన్నారు. ఇకనుంచి ఆపదలో ఉన్న వారిని ఆదుకుని వారికి ఆర్థిక భారం తగ్గించేందుకు మన ప్రాంతంలో నిర్మించే క్రిటికల్ కేర్ యూనిట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వైద్యులు బాగా పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డేవిడ్ సుకుమార్ మెడికల్ సూపరింటెండెంట్ డిసిహెచ్ఎస్ రాయచోటి, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.


ఫోకస్ కెరీర్ హబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సివిల్స్‌లో మంచి ర్యాంకులు సాధించాలి

అన్నమయ్య జిల్లా విద్యార్థులు సివిల్ సర్వీసెస్, ఇతర పోటీ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించి ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సుండుపల్లి రోడ్డు శిబ్యాల గ్రామంలో ఫోకస్ కెరీర్ హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి ప్రాంతంలో ఫోకస్ కెరీర్ హబ్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. రాయచోటి పట్టణంలో మొట్టమొదటిసారిగా ఎక్కడ లేని విధంగా అధునాతన భవనాలతో ఫోకస్ కెరీర్ హబ్ నిర్మించారని చెప్పారు. ఈ సెంటర్ ద్వారా సివిల్ సర్వీసెస్, ఇంజినీరింగ్ ఇతర కోచింగ్ లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో విద్యాభివృద్ధికి అధిక ప్రోత్సాహం ఇస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రతి పోటీ పరీక్షలలో రాష్ట్రానికి చెందిన విద్యార్థులు 30 సంవత్సరాలుగా మంచి మార్కులు సాధిస్తున్నారని తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో ప్రతి ఏటా నీట్, ఇంజనీరింగ్ వంటి అన్ని విభాగాలలో మన విద్యార్థులు అత్యున్నతమైన ప్రతిభ కనపరుస్తున్నారన్నారు. ఇకమీదట సివిల్ సర్వీసెస్‌లోనూ ఈ ప్రాంత విద్యార్థులు కెరీర్ హబ్ సెంటర్ సేవలు ఉపయోగించుకుని మంచి ర్యాంకులు సాధించాలన్నారు ఇన్‌స్టిట్యూట్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఫోకస్ కెరీర్ హబ్ నిర్వాహకులు మంత్రిని గజమాలతో ఘన స్వాగతం పలికారు.

యువ ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరణ..

యువత జిల్లా స్థాయి యువజనోత్సవాలలో పాల్గొని విజేతలుగా గెలిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం యువజన సర్వీసుల వారి సంయుక్త ఆధ్వర్యంలో రాయచోటి లోని (బిట్స్) భాస్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో ఈ నెల 29 న నిర్వహించబోయే యువజనోత్సవాల పోస్టర్‌ను సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువతను ప్రోత్సహించడంలో ప్రభుత్వం ఎల్లవేళలా ముందుంటుందన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు ఉంటాయన్నారు. జిల్లాలోని యువత ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభ చూపించాలన్నారు. యువజనోత్సవాలలో తమ పేర్లు నమోదు చేసుకోవడానికి https://tinyurl.com/DYFANMY`2024ను ఉపయోగించు కోవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్య నిర్వాహకురాలు సాయి గ్రేస్ తెలిపారు. మరిన్ని వివరాలకు 8008819556 లో సంప్రదించలన్నారు.

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి : కలెక్టర్


అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తారన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని చెప్పారు. కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదనరావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య, రాయచోటి ఆర్‌డిఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న ఖాదర్ బాష షేక్

పీలేరు వాసులకు జాతీయ పురస్కారాలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు చెందిన ఇద్దరు వ్యక్తులకు జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయి. ఆదివారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్.సరోజనమ్మ ఆధ్వర్యంలో ఈ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. భారతదేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, స్వాతంత్ర సమరయోధులు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిలు పురస్కరించుకుని, కొమరం భీమ్, సాలూరి రాజేశ్వర రావు, మహానటి సావిత్రి, పునీత్ రాజ్ కుమార్, ఎమ్మెస్ నారాయణ, ఏవీఎస్ వంటి ప్రముఖుల పేరున వివిధ రంగాలకు చెందిన 54 మంది ప్రతిభావంతులకు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ పురస్కారాల ప్రధానం చేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ తెలుగు సినిమా హీరో నరేన్ తేజ్, సినీ రంగుల ప్రపంచం డిజిటల్ ఈ పేపర్, వంశీ టీవీ సీఈఓ డాక్టర్ వంశీకృష్ణ, టివి, సినిమా నటి జ్యోతి స్వరూప్ చేతుల మీదుగా పీలేరు కు చెందిన సీనియర్ జర్నలిస్ట్, సోషల్ వర్కర్, ప్రముఖ బహుభాషా రంగస్థలం కళాకారుడు ఖాదర్ బాషా షేక్ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ లెజెండరీ పురస్కారాన్ని అందుకున్నారు. మండలంలోని రేగళ్ళు గ్రామానికి చెందిన వై.షామీర్ ఇటీవల విజయవాడకు వెళ్లి వరద బాధితులకు ఆయన చేసిన సేవలను, ఇతర సామాజిక సేవలను గుర్తించి భారతదేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఎక్సెలెన్సీ అవార్డును ప్రధానం చేశారు.

యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఎస్ఎంకేర్ సోల్యూషన్ జిఎంబిహెచ్ ద్వారా జర్మన్‌భాషలో శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని, జిల్లాలోని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణాభివృద్ధి అధికారి నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిఎన్ఎం, బిఎస్‌సి నర్సింగ్ చేసి ఉండి, 35 ఏళ్ల వయస్సులోపు ఉండాలన్నారు. అభ్యర్థులు జర్మనీలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. శిక్షణను తిరుపతి స్విమ్స్ నర్సింగ్ కళాశలలో 6 నెలలపాటు ఇస్తారన్నారు. శిక్షణ జర్మన్ భాషలో ఏ 1, ఏ 2, బి 1,బి 2 స్థాయిలో ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను tional@apssdc.in ఈ మెయిల్ ద్వారా పంపాలన్నారు. శిక్షణ డిసెంబర్ 1 నుంచి ప్రారంభమవుతుందన్నారు. పూర్తి వివరాలకు 9988853335లో సంప్రదించాలన్నారు.

ఉడా చైర్మన్‌ను కలిసిన వేణుగోపాల్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సోమవారం విశాఖ పట్నంలోని విఎంఆర్‌డిఎ భవన్‌లో విశాఖపట్నం మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్ మెంట్ అథారిటీ (ఉడా) చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.


ప్రణవ్ గోపాల్‌ను సన్మానిస్తున్న వేణుగోపాల్

సత్తా చాటిన 'శ్రీసాయి' విద్యార్థులు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో సత్తాచాటారు. ప్రముఖ బహుళ జాతి సంస్థ పెంటాగన్ స్పేస్, బెంగుళూరు సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక వేతనానికి ఎంపికయ్యారని శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ ఉద్యోగ నియామకాల కార్యక్రమానికి పెంటాగన్ స్పేస్ ప్రోగ్రాం, రిక్రూటింగ్ విభాగపు ప్రతినిధులు హరీష్, కాజల్ హాజరై విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ఐటి రంగ నియామకాల విధివిధానాలను, రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, వంటి అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగించారు. శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఐటి రంగం ఉద్వాసన రంగాన్ని అధిగమించి తిరిగి నియామకాల జోరు అందుకుంటుందని వివరించారు. సంస్థ నిర్వహించిన వివిధ దశల ఎంపిక ప్రక్రియలో కళాశాల నుండి 10 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి సాఫ్ట్‌వేర్ ట్రైనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారికి నాలుగు లక్షల వార్షిక వేతనం అందుతుందని తెలియజేశారు. కళాశాలలో ప్రతి విద్యార్థికీ ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనపరచడానికి అవసరమగు అర్థమెటిక్, కమ్యూనికేషన్ స్కిల్స్ ,రీజనింగ్ వంటి అంశాలపై ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి కొత్తపల్లి ఇంతియాజ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం


అనాథలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య యూనివర్సిటీలోని ఎన్‌సిసి విద్యార్థులు ఇసుకపల్లి రోడ్డు, సిద్దేశ్వర కాలనీలో లవింగ్ ఆర్మ్స్ ఆర్ఫనేజ్ అనాథాశ్రమంలో పిల్లలకు పండ్లు, సబ్బులు, టూత్ పేస్ట్, టూత్ బ్రష్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని మాట్లాడుతూ ఎన్‌సిసి డేను పురస్కరించుకొని అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఎన్‌సిసి విద్యార్థులు అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేయడంతో కళాశాల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ప్రో ఛాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డిలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చెప్పారు. విద్యార్థులు ఎన్‌సిసిలో చేరడం వల్ల సమాజానికి సేవ చేయవచ్చని, ఉన్నత చదువుల్లో, ఉద్యోగాలలో రిజర్వేషన్ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లిఖార్జునరావు, సిటిఓ ఎన్.దీప్తి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.షైపుల్లా, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి కొండయ్య నాయుడు

నేరాల రేటు తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలి


- మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు

ప్రజాశక్తి - రామసముద్రం

నేరాల రేటు తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలని మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు అన్నారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు ఫైళ్లు పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చట్టాలపై అవగాహన కల్గివుండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. శాంతి భద్రతలు కాపాడడంలో, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పోలీస్ శాఖ ముందుంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన రామసముద్రం మండలంలో క్రైమ్ రేటు తగ్గించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముక్యంగా మండలంలో అక్రమ మద్యం రవాణా, నాటుసారా తయారీ, మత్తు పదార్థాలు రవాణా, సరిహద్దులు దాటుతున్న ఇసుక అమ్మకాలను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువత అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడం కోసం అడ్డదారుల్లో వెళ్లి సమాజానికి కీడుచేసే చెడు ఆలోచనలతో శాంతిభద్రతలకు విఘాతం కల్గించే విధంగా ప్రవర్తించి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. విలేకరుల సమావేశంలో రూరల్ సిఐ రమేష్, ఎస్ఐ వెంకట సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వనభోజన మహోత్సవంలో 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మన్నూరు గ్రామంలో నాగలకట్ట దగ్గర నాగలకట్ట సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా సోమవారం వనభోజన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన నేత యల్లటూరు శ్రీనివాస రాజు పాల్గొని ముందుగా నాగలకట్ట దగ్గర ప్రత్యేక పూజలు చేశారు. తరువాత ప్రజలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అన్నం వడ్డిస్తున్న శ్రీనివాసరాజు

కొలువుదీరిన టౌన్ బ్యాంక్ నూతన పాలకవర్గం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ది మదనపల్లి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ నూతన పాలకవర్గం కొలువుదీరింది. సోమవారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టౌన్ బ్యాంకు ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు ఎన్నికల అధికారిణి దుర్గమ్మ డిక్లరేషన్లను అందజేశారు. అనంతరం చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, 11 మంది డైరెక్టర్లు ఆకుల కృష్ణమూర్తి, ఆకుల సిద్ధప్ప, జోళపాళ్యం దేవేంద్ర బాబు, దిగువపాళ్యం నిరంజన్ కుమార్, నాదెళ్ళ వెంకటేశ్వర ప్రసాద్, నిమ్మనపల్లి ముక్తియార్ ఖాన్, పఠాన్ సర్దార్ ఖాన్, రాటకొండ సి.సోమ శేఖర్, రామిశెట్టి భాస్కర్, శ్రీరామ రవికాంత్ బాబు, సవరం భాస్కర్ కుమార్, సూరె రవీంద్రనాథ్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కొలువు దీరిన చైర్మన్, డైరెక్టర్లును తెలుగు దేశం, బిజెపి, జనసేన, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, బ్యాంకు సిబ్బంది, షేర్ హోల్డర్లు, ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ టౌన్ బ్యాంకు సేవలను పుర ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, అవసరమైన వారికి సులభమైన రీతిలో రుణాలు అందించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా టౌన్ బ్యాంకును అభివృద్ధి చేయడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన బ్యాంకు సేవలను మరింత విస్తరిస్తూ ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా సహకారంతోపాటు డైరెక్టర్లతో సమన్వయం చేసుకొంటూ సిబ్బంది ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. బ్యాంకు సేవలు మరింత మందికి అందించే విధంగా విస్తరణ దిశగా ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. కొలువు దీరిన పాలక వర్గాన్ని పొన్నూటిపాళెం సర్పంచ్ చిప్పిలి చలపతి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.


విద్యాసాగర్‌కు డిక్లరేషన్ ఇస్తున్న ఎన్నికల అధికారి దుర్గమ్మ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు

చేతివృత్తులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులు చేతివృత్తులపై అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయులు శారద సూచించారు. సోమవారం ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు వృత్తిపరమైన, వ్యాపారం మీద అవగాహన కోసం కలికిరిలో కొన్ని సూపర్ మార్కెట్‌కు వెళ్లి వ్యాపారం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వృత్తిపరమైన పనులు, వ్యాపారంపై అవగాహన ఉన్నప్పుడే మెరుగైన ఉపాధి కలిగి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనేలమల్లేశ్వర స్వామి కుంభాభిషేకం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తవళం గ్రామంలోని శ్రీయోగ నేలమల్లేశ్వర స్వామి జలపూరిత కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించినట్లు ఇఒ మంజుల, ఆలయ తాత్కాలిక కమిటి సభ్యులు మేష రామకృష్ణ తెలిపారు. కుంబాభిషేక ఉత్సవాల్లో ముఖ్య అతిధులుగా మార్పూరి శశిధర్‌రెడ్డి, శంకర భాస్కర, రాజన్న, సర్పంచ్ రెడ్డప్ప పాల్గొన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో స్వామి వారికీ జల పూరిత కుంబాభిషేక మహోత్సవాన్ని ఆలయ ఇఒ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు శంకర స్వామి శాస్త్రి, లక్ష్మీ స్వామి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆలయ సమీపంలోని బహుదా ఉపనది అయిన కుమార నది నుంచి పవిత్రమైన జలాన్ని మేళతాలలు, వాయిద్యాలు, నాణ్యాలు, చెక్కభ జనలు, కోలాటాలు, దేవర ఎద్దులు మధ్య అంగరంగ వైభవంగా తెచ్చి నేలమ ల్లేశ్వర స్వామికి అభిషేకించారు. జల పూరిత కుంభాభిషేక రూపంలో నేల మల్లేశ్వర స్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. చిన్న రెడ్డప్ప ఆధ్వర్యంలో ఉదయం నుంచి భక్తులకు అన్న దానాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మేష రామకృష్ణ, మాజీ ఎంపిటిసి రెడ్డప్ప కుంభాభిషేకం ఉత్సవాన్ని పర్యవేక్షించారు. పలువురు ప్రము ఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక పోలీసులు బందోబస్తులు నిర్వహించారు.

ఖండాంతరాలు దాటిన జగన్ అవినీతి : ఆర్‌జె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


మాట్లాడుతున్న ఆర్.జె.వెంకటేష్

మాజీ ముఖ్య మంత్రి వైఎస్.జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆయన అవినీతి ఖండాంతారాలు దాటిపోయిందని టిడిపి రాజంపేట అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ అన్నారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలకు ఎలాంటి మేలు చేయక పోగా, తన అవినీతి మాత్రం రాష్ట్రాలు కాదని ఖండాంతరాలను దాటిపోయిందని విమర్శించారు. రూ.1750 కోట్ల లంచం కోసం రాష్ట్ర ప్రజలను అంధకారంలోకి నెట్టేసారని మండిపడ్డారు. కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చి రాబోవు 20 ఏళ్ల భవిష్యత్తును నాశనం చేశారని విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వంలో పలు కంపెనీలు రాష్ట్రానికి తరలివస్తుంటే, గత వైసిపి పాలనలో ఎందుకు ఏ ఒక్క కంపెనీ కూడా రాలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్ తన వైఖరిని మార్చుకోవాలని హితువు పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు పని చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రతీ ఒక్కరూ పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు.

ఆయాలకు గౌరవ వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, రాత్రి కాపలా దారులు (నైట్ వాచ్ మన్)లకు సంబంధించిన గౌరవ వేతనాలు 5 నెలల నుండి ప్రభుత్వం విడుదల చేయలేదని, వాటిని వెంటనే విడుదల చేసి వారి కుటుంబాలను కాపాడాలని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ మల్‌రెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తరగతి గదులు శుభ్రం చేయడం, మూత్రశాలను శుభ్రంచేసే చిరు ఉద్యోగుల మీద ప్రభుత్వం దయవుంచి వారి 5 నెలల గౌరవ వేతనం విడుదల చేయాలన్నారు. ప్రతి పాఠశాల నుండి ప్రధానోపాధ్యాయులు ప్రతి నెలా వారికి సంబందించిన బిల్స్‌ను ఎంఆర్‌సికి చేరుస్తున్నామన్నారు. కొంత మంది ఆయాలు, నైట్ వాచ్‌మెన్లు పాఠశాలకు రాకుండా నిలిపివేయాలని నిర్ణయించుకుంటున్నారన్నారు. వారిని కొనసాగించే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌వల్లి, సోమశేఖర్ పాల్గొన్నారు.

వింత వ్యాధితో ఆవులు మృతి

- ఆందోళనలో పాడిరైతులు

ప్రజాశక్తి -రామాపురం


మృతి చెందిన ఆవు వద్ద రోధిస్తున్న రైతు

ఆవులకు శరీరం అంతా బొబ్బలు రావడం వారం రోజుల్లో మృతి చెందడంతో పాడి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు మండలంలోని సరస్వతిపల్లి దళితవాడలో నెల రోజులుగా ఒంగోలు జాతి ఆవులకు, దూడలకు చర్మంపై బొబ్బలు వచ్చి రోజుల వ్యవధిలో తల వాపు రావడం మృత్యువాత పడుతున్నాయని పాడిరైతులు వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా బిడ్డలను పెంచుతున్నట్లు సాకుతున్నామని, ఈ మాయదారి రోగం వల్ల కళ్ళ ఎదుట చనిపోతున్నాయని వాపోతున్నారు వారం రోజుల్లోనే సలవ వీరనాగయ్య చెందిన దూడ ,సగినాల ఈశ్వరయ్య, సగినాల నాగులయ్య చెందిన ఒంగోలు జాతి ఆవులు, దూడలు మృతి చెందాయి. చర్మం పెద్ద బొబ్బలు కనబడిన వెంటనే ఆసుపత్రి వెళితే అక్కడ పట్టించుకున్న నాథుడు లేరని, ఉన్న వారు బయట మందులు తెచ్చుకోవాలని చీటీ రాసి ఇస్తారని ఆ మందులు వాడినా ప్రయోజనం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంట్లో పాడి పశువులున్నాయని, దిక్కుమాలిన వ్యాధి వల్ల ఎంతమంది నష్టపోవాల్సి వస్తుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు కూలీనాలీ చేసుకుని ఒంగోలు జాతి ఆవులు, దూడలను పెంచుకుంటున్నామని చెప్పారు. జిల్లా అధికారులు స్పందించి ఆవులకు వచ్చే వ్యాధిని కనుగొని నివారణ మందులు ఇచ్చి ఆదుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై పశు వైద్యాధికారిని వివరణ కోరగా 2023 డిసెంబర్ నుండి ఇప్పటివరకు ఎలాంటి మందులు ప్రభుత్వం పంపలేదని తాము ఏమీ చేయలేమని చెప్పడం కొస మెరుపు

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

- ఎన్‌హెచ్ రోడ్డుకు చెరువుమట్టి తరలింపు
- కొండలు, గుట్టలు కొల్లగొట్టేస్తున్న వైనం
- టిప్పర్లతో ఇష్టానుసారంగా తరలిస్తున్నారు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

కోట్లు రూపాయలను కాంట్రాక్టులకు ఇచ్చి.. కొండలు, గుట్టలను కొల్లగొట్టేస్తూ.. చెరువుల్లో ఇష్టానుసారంగా వందల టిప్పర్ల మట్టిని ఎత్తుకెళ్లి జాతీయ రహదారి (ఎన్‌హెచ్) రోడ్డుకు వాడుకుంటుండడంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. మదనపల్లి-తిరుపతి ఎన్‌హెచ్ రోడ్డుకు కోట్ల రూపాయలు వెచ్చించారు. కాంట్రాక్టర్‌కు కోట్లు మిగిల్చేందుకు అధికారులు జిల్లాలో నిద్రపోతుండడం గమనార్హం. కొండలను సైతం పిండి చేసేసి, గుట్టలను, చెరువులను కొల్లగొట్టేస్తూ ఇష్టానుసారంగా మట్టిని ఎత్తుకెళ్తుండడంతో ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వం ఎన్‌హెచ్ రోడ్డుకు కోట్ల రూపాయలు వెచ్చించినప్పుడు చెరువుల్లో మట్టికి కనీస రుసుము కూడా పంచాయతీలకు చెల్లించకుండా వందల టిప్పర్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్న విమర్శలు అనేకం వినిపిస్తున్నాయి. స్థానిక అధికారులు


చెరువులో మట్టిని తోడేస్తున్న హిటాచి వాహనం

కూడా ఏ మాత్రం పట్టించుకోకుండా మాకేం తెలియదు అన్నట్లు ఉండడం చూస్తే వీరికి మామూలు చేరిందేమో అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. కాంట్రాక్టర్‌కు కోట్లు మిగిల్చేందుకే ప్రభుత్వ భూములు, చెరువుల్లో మట్టిని ఎత్తుకెళ్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ చెరువుల్లో మట్టిని తరలిస్తున్న వారి వద్ద నుంచి పంచాయతీలకు కనీస రుసుము చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో వేగంగా స్పందించాలి : 'చమర్తి'


నందలూరు : సిసి రోడ్లకు భూమిపూజ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-నందలూరు

ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు వేగంగా స్పందించాలని, ప్రభుత్వ ఆదేశాలు,ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షు చమర్తి జగన్ మోహన్‌రాజు తెలియజేశారు. సోమవారం మండలంలోని పాటూరు, ఆడపూరు, నీలిపల్లె గ్రామాల్లో రూ.76 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వికాసం అంటే గ్రామాల్లో నివసించే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించడమే అని అభివృద్ధి అంటే మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అలాంటి లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ముందు కెళ్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, మండల పార్టీ అధ్యక్షులు జంగంశెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రవీణ్ కుమార్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, మాజీ మండల వైస్ ప్రెసిడెంట్ పల్లె సుబ్రహ్మణ్యం, మాజీ కో-ఆప్షన్ నెంబర్ మున్వర్ బాష, తాటి సుబ్బరాయుడు, మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, ఆబూబకర్, ఎస్కే కరీమ్, యువ నాయకులు తేజాల ఆనంద్, జ్యోతి శివ, మాజీ ఎంపిటిసి బీమా మునిస్వామి, తుంటి రమణయ్య, గంగనపల్లి శ్రీనివాసులు, బొబ్బిలి సుబ్బరాయుడు, గంధం గంగాధర్, బుర్ర సుబ్బరాయుడు, ఉప్పుశెట్టి రెడ్డయ్య, చామంతి పెంచలయ్య, గౌస్ బైక్, పోడపోతుల రాము, రమేష్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

వీరబల్లి : గ్రామాలలో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. సోమవారం మండలంలోని మట్లి గ్రామపంచాయతీ, తొగటపల్లె, వడ్డీ పల్లెల్లో రూ.19.90 లక్షలతో నిర్మించబోయే సిసి రోడ్లకు ఆయన సర్పంచ్ నాగార్జున ఆచారి, పంచాయతీరాజ్ ఎఇ నాగూర్ మీరా ఇతర అధికారులతో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరికి మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. రోడ్లు, మంచినీరు, విద్యుత్, విద్యా, వైద్యం చాలా ముఖ్యమని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భానుగోపాలరాజు, బిజెపి మండల కన్వీనర్ నరేంద్ర, మట్లి సర్పంచ్ నాగార్జున ఆచారి, ఉమామహేశ్వరరాజు, మహేశ్వర రాజు, మాజీ సర్పంచ్‌లు లక్ష్మయ్య, నాగ ముని, నందకుమార్ నాయుడు, రాంప్రసాద్ నాయుడు, ప్రతాపరెడ్డి సురేందర్ రెడ్డి, ధర్మారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పద్మనాభరెడ్డి, బిసి నాయకులు చలపతి, మాజీ సర్పంచ్ మల్లికార్జున, అమరేశ్వర రాజు, భాస్కర్ రాజు, మండల మహిళా అధ్యక్షులు నాగసుబ్బమ్మ, చంద్రబాబు నాయుడు, సుధాకర్ నాయుడు, అంజనీ కుమార్ నాయుడు, సలీం రమణ టిడిపి నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం గురప్పగారిపల్లి గ్రామపంచాయతీలో వంగిపురం దళితవాడ, అచ్చిరాజుగారి పల్లి, కొత్త వడ్డేపల్లి, గుర్రప్ప గారి పల్లిలోనూ రూ. 15 లక్షలతో నిర్మించబోయే సిమెంట్ రోడ్డును చమర్తి జగన్ మోహన్ రాజు ప్రారంభించారు.

హైకోర్టు మార్గదర్శకాలను తప్పక పాటించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : పోలీసులు రిమాండ్‌పై హైకోర్టు మార్గదర్శకాలను తప్పక పాటించాలని ఎపిపి వీరాంజనేయులు తెలిపారు. సోమవారం స్థానిక జూని యర్ సివిల్ జడ్జి కోర్టులో ములకలచెరువు సర్కిల్ సిఐ లక్ష్మన్న ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టాల మార్పు, సెక్షన్లో రిమాండ్ రిపోర్ట్ తదితర అంశాలపై పూలంకషంగా చర్చించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తంబళ్లపల్లి ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి, మొలకలచెరువు ఎస్ఐ గాయత్రి, పెద్దతిప్ప సముద్రం ఎస్ఐ నరసింహుడు, పెద్దమండ్యం ఎస్ఐ పి.వి.రమణ పాల్గొన్నారు. అనంతరం స్థానిక పోలీస్టు స్టేషన్లో సిఐ లక్ష్మన్న, ఎస్‌ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ప్రతిరోజు వారి వారి స్టేషన్ల పరిధిలో నాటు సారా అమ్మకాలు పేకాట, కోడి పంద్యాలు తదితర ఆ సాంఘిక కార్యకలాపాలపై పర్యవేక్షిస్తూ చర్యలు చేపట్టాలని సూచించారు.


మాట్లాడుతున్న ఎపిపి వీరాంజనేయులు

కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ


తలపడుతున్న ప్రకాశం, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్లు

ప్రజాశక్తి - కడప

అండర్- 23 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై నాలుగు వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 50.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది. ఆ జట్టులోని ప్రశాంత్ 64, మహేంద్ర రెడ్డి 42 పరుగులు చేశారు. ఈస్ట్ గోదావరి జట్టులోని శివ సూర్యా 2, శివ 2, వంశీ నారాయణ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 269 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 47.3 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని సాయి శ్రావణ్ 93, విజయ్ 53 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లికార్జున 4, ప్రదీప్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై 79 పరుగుల తేడాతో ప్రకాశం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు 50.0 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ 119 పరుగులు (సెంచరీ) చేశాడు. అభినవ్ 75 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్‌నార్త్ జోన్ జట్టులోని హేమంత్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 346 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 48.5 ఓవర్లలో 266 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి 79 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఆ జట్టు లోని హిమకర్ 64, రవి కిరణ్ 65 పరుగులు చేశారు. ప్రకాశం జట్టులోని సు మిత్ నాలుగు, పార్థసారథి రెండు, పవన్ కుమార్ రెండు వికెట్లు తీసుకున్నారు.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో 117 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టుపై రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 50.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 323 పరుగులు చేసింది. ఆ జట్టులోని పి.సుబ్రహ్మణ్యం 129 పరుగులు (నాట్ అవుట్) చేశాడు. ధరణి కుమార్ నాయుడు 59 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు లోని రాజు 2, సుబ్బారావు 2, దీపక్చంద్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 324 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కుదిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 50.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని స్వామి నాయుడు 100 పరుగులు (సెంచరీ) చేశాడు. వసంత్ వర్ధన్ 30 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని ధరణి కుమార్ నాయుడు 5 వికెట్లు, ఆదిల్ హుస్సేన్ రెండు వికెట్లు తీసుకున్నారు.



ఛాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్ దాము

కరాటేలో సత్తా చాటిన పీలేరు విద్యార్థులు

ప్రజాశక్తి-పీలేరు

కరాటే పోటీల్లో పీలేరు విద్యార్థులు తమ సత్తా చాటి ఛాంపియన్షిప్ సాధించారు. ప్రొద్దుటూరులో ఆదివారం జరిగిన ఇంటర్ స్టేట్ లెవల్ కరాటే చాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో పీలేరుకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి ఛాంపియన్స్‌గా నిలచినట్లు కరాటే మాస్టర్ దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా కటాన్ లో మోక్షశ్రీ, సఫా ఫరాజిన్ బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు. కుమితే, నాన్చాక్ పోటీల్లో చరణ్, ప్రవీణ్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు వివరించారు. సివిల్ కోర్టు జడ్జి ఎస్.ఎం.ఇస్మాయిల్ చేతుల మీదుగా విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారని దామోదర్ పేర్కొన్నారు.

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - వీరబల్లి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని కొత్తగా గృహాలు అవసరమైన వారు ఈనెల 30 లోపల దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ నూర్జహాన్ సోమవారం తెలిపారు. మండల పరిధిలోని గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ లాగిన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పిఎంవైయు 2.0 డిమాండ్ ఎంట్రీ 2.0 కింద కొత్త ఇల్లు యూనిట్ కాస్ట్ రూ.2.50 లక్షలు ఉంటుందన్నారు. భార్య, భర్త ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డ్, జాబ్ కార్డ్, మొబైల్ నెంబర్, వారి సంతకం, కులము, ఉప కులము, పత్రాలు తీసుకొని సచివాలయం కెళ్లి ఇంజినీరింగ్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం పెట్టిన ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గతంలో మంజూరైన గృహాలు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలన్నారు.


సిమెంట్ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ముక్కా, శ్రీధర్

సిసి రోడ్డు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని బిపి రాచపల్లి పంచాయతీ నుంచి ఎస్టీ కాలనీ వరకు రూ.95 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు ఆడ చైర్మన్ ముక్కా రూపనందరెడ్డి, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో సిమెంటు రోడ్డు లేని గ్రామం వీధి ఉండకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మల్లయ్య కొండకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండపై వెలసిన శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి చివరి కార్తీక సోమవారం భక్తులు పోటెత్తారు. అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఉదయాన్నే మల్లికార్జున స్వామిని, ప్రత్యేక అలంకరణతో అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. కొండపైన భక్తుల పేరిట పూజలు అభిషేకాలు చేసి తీర్థప్రదాయాలను భక్తులకు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఇఒ మునిరాజు, సిబ్బంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆలయానికి వెలుపల వెలిసిన గౌరమ్మ తల్లి ఆల యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.


విద్యార్థులతో ఎంపిడిఒ జయశ్రీ

పాఠశాలలో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంపిడిఒ జయశ్రీ అకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలలో భాగంగా 4, 5వ తరగతుల విద్యార్థులు ప్రాక్టీస్ చేస్తున్న భారత రాజ్యాంగంను చూసి విద్యార్థులను అభినందించారు. ఇలా చిన్న వయసులోనే రాజ్యాంగం గురించి అవగాహన కల్పించడం హర్షణీయమని పేర్కొన్నారు. విద్యార్థుల నిర్వహించే వివిధ అభ్యసన కృత్యాలను చూసి అభినందించారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేలా బోధన ఉంటే పిల్లలు చాలా చురుకుగా ఉంటారని పేర్కొన్నారు.

పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి

పరిశుభ్రత పచ్చదనంతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఎంపిడిఒ భానుమూర్తిరావు సూచించారు. సోమవారం బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయమ్మ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల వాడకం పరిశుభ్రత పైన విద్యార్థిలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామాలలో మరుగుదొడ్ల వాడకాన్ని పరిశుభ్రత పారిశుధ్యమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కరీముల్లా, ఎఒ సురేంద్ర బాబు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం హమారా సౌచాలయ హమారా సమ్మాన్ కార్యక్రమంలో భాగంగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ రెడ్డిశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంగల్ రాయుడు, సిఎంఆర్‌డి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బి.కొత్తకోట : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

క్రైం కార్నర్

స్కూటర్‌ను ఢీకొన్న కారు : వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - నందలూరు : కడప-చెన్నై ప్రధాన జాతీయ రహదారిలోని కన్యకా చెరువు కట్టపై ఉన్న పెట్రోల్ బంకు వద్ద సోమవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనలో బైకు నడుపుతున్న వ్యక్తి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే...కడప నుండి రైల్వేకోడూరుకు వెళ్తున్న తహశీల్దార్ మహబూబ్ చాంద్ కారు మండలంలోని చెన్నయ్యగారిపల్లెకు చెందిన నరసింహులు పెట్రోల్ కోసం రోడ్డు దాటుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న తహశ్శల్దారు వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహులుకు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయాల పాలైన నరసింహులను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన మహిళ సోమవారం మృతి చెం దింది. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. కురబలకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన బంట్రోతు కిట్టన్న భార్య నాగసుబ్బమ్మ (65) కంటి ఆపరేషన్ చేయంచమని కొద్దిరోజులుగా భర్తను అడుగుతోంది. ఆమెకు షుగర్ ఉండడంతో ఆపరేషన్ చేయలేమని వైద్యులు చెప్పడంతో విషయాన్ని దాచిపెట్టి ఆపరేషన్‌ను వాయిదా వేస్తూ వచ్చాడు. తీవ్ర మనస్తాపానికి గురైన నాగసుబ్బమ్మ ఆదివారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలిని మదన పల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలి పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

15 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, సారా స్వాధీనం చేసుకుని అతనిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీకు చెందిన పిల్లి నారాయణ నాటు సారా తయారుచేసి గ్రామానికి సమీపంలోని పొదల్లో ఉంచి విక్రయిస్తుండగా సోమవారం పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారన్నారు. అతని వద్ద నుంచి 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.